# సుశీల

శ్రీమతి నాయిని హనుమాయమ్మగారు

(ప్రవేశము: రాజలక్ష్మమ్మ, రాఘవమ్మ)

రాఘు:—ఏమి? రాజమ్మవదినా! మీ యింట్లో భోజనాలు అయినవా?

రాజ:—రా! కూర్చో! భోజనాలు అయినవి.

రాఘు:—ఇల్లు సందడి లేదు. మీ కోడలు ఎక్కడ?

రాజ:—ఎవరో స్నేహితురాలింటికి వెళ్ళి, ఎక్కడో గానసభ అట, అక్కడకు వెళ్ళి, సాయంకాలము వస్తానని చెప్పి వెళ్ళినది.

రాఘు:—సరే గాని, సంసారికదా? గానసభ లేమిటి? స్నేహితులయిండ్లకు వెళ్ళడమేమిటి? ఏమోనమ్మ! నాకు యివన్నీ సరిపడవు.

రాజ:—అయితే ఏమిలే! ఈకాలపువాళ్ళని మనలాగే ఉండమంటే ఉంటారా? ఏదో చిన్నతనము! వారి యిష్టప్రకారం తిరగనియ్యి! యింట్లో ఉండి చేసేదేమిటి?

రాఘు:—ప్రభాకరు డేడీ! వానిని నీ కోడలు బాగా చూచుచున్నదా? ఎంతైనా మారుతల్లి. కన్నతల్లిలాగ చూచునా? వాడిఖర్మము. తల్లిపోయెను. మారుతల్లి వచ్చెను.

రాజ:—రామ, రామ, యిట్లామాటలు అనకమ్మా! నాకోడలు సుశీల చాలా మంచిది. యోగ్యురాలు. తన కొడుకు మురళితో సమానముగా ప్రభాకరుని ప్రేమించును. నన్ను గౌరవించును. నాకొడుకును భక్తితో చూచును. ప్రభాకరుని హృదయపూర్వకముగా ప్రేమిస్తుంది. నాపుణ్యము బాగుండి మంచికోడలు దొరికింది.

రాఘు:—(తనలో) నాపాచిక పడలేదు. (ప్రకాశముగా) సరే వదినా! వెళ్ళివస్తా. నీకూతురు కమల ఎప్పుడువస్తుంది?

రాజ:—సుశీల రమ్మని వ్రాస్తూవున్నది. పండుగకు వచ్చునేమో!

రాఘు:—మంచిది. వెళ్ళివస్తానమ్మా!

—నిష్క్రమించును.

*　　*　　*　　*　　*

(వాసుదేవరావు, సుశీల జడవేసికొనుచు ప్రవేశము)

సుశీల:—ఈ రోజు నేనొక తప్పుచేసితిని.

వాసు:—ఏ మది?

సుశీల:—ప్రభాకరుని కొట్టితిని.

వాసు:—ఎందులకు?

సుశీల:—ప్రక్కయింటి పిల్లలు బంతి ఆడుకొనుచుండగా బంతి వచ్చి మన దొడ్డిలో పడినదట. దానిని మన ప్రభాకరుడు బాల్యచాపల్యముచే తీసికొని దాచిపెట్టి, వారడుగగా లేదని చెప్పి వారితో జగడమాడుచుండగా, నేను వెళ్ళి బంతి వారికిప్పించి, అబద్ధము చెప్పినందుకు, దాచిపెట్టి జగడమాడినందుకు ప్రభాకరుని కొట్టితిని. ఇప్పుడు పశ్చాత్తాపముకలుగుచున్నది.

వాసు:—సరీ! ఇందులో నీతప్పేమియున్నది? వాడు చేసినది దండనార్హమైన తప్పు. నీవు కొట్టి, బుద్ధిచెప్పి మంచిత్రోవకు తెచ్చుట మంచిపని. ఇందు నీవు పశ్చాత్తాపపడవలసిన పనిలేదు.

సుశీల:—ఏమైననూ, వానికి ఒక చిన్న సైకిలు కొనియివ్వవలెను. అప్పటికిగాని నాకు తృప్తి కలుగదు. అన్నట్లు వానికి దసరాలోపల బట్టలు కుట్టించవలెను. పిల్లలందరు క్రొత్తబట్టలు కట్టుకొంటే వీనికి మనస్సు చిన్నబోవును.

వాసు:—ఏడేండ్లవానికి అప్పుడే సైకిలెందుకు? వీనికి కొంటే మురళికి కొనవద్దా?

సుశీల:—మురళికి ఇంకా మూడేండ్లేకదా? వానికేమియూ తొందరలేదు. అదిగో! మాటలలోనే వచ్చుచున్నాడు.

(ప్రవేశము: ప్రభాకరుడు)

ప్రభా:—అమ్మా! దసరాకు నాకు ఏమి కొనిపెట్టతావమ్మా! మంచిమంచిబట్టలు, బంగారు బత్తానులు కొని ఇస్తావా?

వాసు:—నాన్నా! ప్రభాకరా! అమ్మదగ్గరకు వెళ్ళకురా! అమ్మ నిన్ను కొట్టిందికదూ? రా! నాదగ్గరకురా. అన్నీ కొనిస్తాను.

ప్రభా:—వద్దు, నాకు అమ్మయేకావలెను. అమ్మ కొట్టినా నాకు అన్నీ కొనిస్తుంది. అమ్మా! నేను పెద్దవాడనైనప్పుడు నీకుకూడా అన్నీ కొనిస్తానమ్మా!

వాసు:—(తనలో) ఔరా! వీనికి సుశీలయందు మాతృభావమున్నది? సుశీల వీనిని తన కన్నకొడుకు మురళికంటే ఎక్కువ ప్రేమతో జూచుచున్నందునకదా! వీనికి మాతృభావము కల్గుచున్నది. ఇట్టి సాధ్విని భార్యగా బడయుట నాపూర్వ జన్మసుకృతము.

సుశీల:—సరేలే! బాబూ! తమ్ముడెక్కడ? పద, మీ ఇద్దరికీ నీళ్లుపోసి అన్నము పెట్టెదను (జడ వేసికొని) రా, వెళ్ళుదము.

—నిష్క్రమింతురు.

* * * * *

(ప్రవేశము: రాఘవమ్మ, సుశీల.)

రాఘ:—సుశీలా! మీ అత్తగారు ఎక్కడ? కొంచము పనివుండి వచ్చినాను.

సుశీల:—కామాక్షమ్మగారియింటికి వెళ్ళినారు. కూర్చోండి, యిప్పుడే వచ్చెదరు.

రాఘ:—మీనాన్న, అమ్మ బాగా వున్నట్లు ఉత్తరాలు వస్తున్నవా? నీవు మళ్లీ పుట్టింటికి ఎపుడు వెళ్ళుతావు?

సుశీల:—శారదానవరాత్రులకు రమ్మని వ్రాస్తూయున్నారు. వీలుగాఉంటే వెళ్ళెదము.

రాఘ:—ఎవరెవరు వెళ్ళెదరు? వాసుకూడా వస్తాడా?

సుశీల:—లీవు దొరకదట. నేను, ప్రభాకరుడు, మురళి వెళ్ళెదము.

రాఘ:—ప్రభాకరుడెందుకు? వాడేమైనా నీకొడుకు గనుకనా?

సుశీల:—నాకు మురళి ఎట్లనో, ప్రభాకరుడు అంతే.

రాఘ:—మీఅత్తగార్కి మాత్రం ప్రభాకరునిమీదే ఎక్కువ ప్రేమ. అదేమిటమ్మా! తనకు నీకొడుకెట్లనో, వాడున్నూ అంతేకదా?

సుశీల:—ఉండవచ్చును. వానికి తల్లిలేదు కనుక అట్లు చూచెదరేకాని ఆమెకు అందరియందు సమాన ప్రేమకలదు. ఆమె చాలా తెలిసినవారు. మమ్ముల నందరను సమదృష్టితో చూచెదరు.

రాఘు:—(తనలో) అబ్బో! వీరికి కలహముగల్పించుటకు నావల్లగాదు. నేను వచ్చినపని కాలేదు. నాపాచికపడలేదు. (ప్రకాశముగా) అమ్మాయీ! వెళ్ళివస్తా. మీ అత్తగారు వస్తే నేను వచ్చినట్లు చెప్పు.

సుశీల:—మంచిది.

* * * * *

(సుశీల ఆయాసము, జ్వరముతో బాధపడుచూ మంచముపై పరుండియుండును.

రాజలక్ష్మమ్మ, వాసుదేవరావు, డాక్టరు, ప్రభాకరుడు, మురళి.)

వాసు:—నిన్నటికంటే కొంత గుణమేనా ?

డాక్టరు:—అట్లనేవున్నది. బహుశః రేపటికి తగ్గవచ్చును.

రాజ:—డాక్టరు బాబూ ! నాసుశీలను బ్రతికించు నాయనా? ఈ జబ్బునయమవుతుందా? నీదే భారము.

డాక్టరు:—అవ్వగారూ ! మీరేమియూ భయపడకండి. రేపటికి నయముకావచ్చును. ఈమందే యిస్తూయుండండి.

ప్రభాకరుడు:—మా అమ్మకు నేను మందిస్తానండీ !

మురళి:—ఆ, నేనిస్తాను.

ప్రభాకరుడు:—(మంచమువద్ద కేగి) అమ్మా ! కాళ్లు పట్టేదా ?

సుశీల:—వద్దు, నాయనా !

రాజ:—డాక్టరుబాబు! నాకేమో బెంగగావున్నది. నాకోడలు అట్లాపడిఉంటే ఈఇల్లుచూడండి. ఏమైనా కాంతివున్నదేమో? నాయనా! మంచిమందు ఇచ్చి త్వరలో మాకష్టముతీర్చు. (కన్నులనీరునించును)

డాక్టరు:—అవ్వగారూ! మీరు వూరికే అధైర్యపడకండి. నేను వెళ్ళుచున్నాను. ఈమందే ఇవ్వండి. రేపు మరల వచ్చి చూచెదను.

—నిష్క్రమించును.

రాజ:—స్వామీ ! తూర్పుదిక్కున ఉన్న జగన్నాథస్వామీ! నాకోడలికి త్వరలో జబ్బు నయమై ఆరోగ్యముకలిగనేని, నా కొడుకును, కోడలిని, నీసన్నిధికిపంపిస్తాను. స్వామీ! నా మొరఆలకింపు.

* * * * *

క్రమముగా సుశీలకు కొన్నాళ్లలో ఆరోగ్యము కలిగెను. రాజలక్ష్మమ్మ తను దేవుని వేడుకొన్న విధమున కొడుకును, కోడలిని, మనుమలను జగన్నాథయాత్రకు పంపించెను. ఒకపరి స్వామిని తాను దర్శించియుండుటచే తను యింటివద్దయుండెను. వాసుదేవరావు, సుశీల, వారిబిడ్డలు జగన్నాథము వెళ్ళి స్వామిని సేవించి, శక్తికొలది దానధర్మలు చేసికొని సురక్షితముగా స్వగృహము చేరిరి. సుశీల అత్తగారికి నమస్కరించెను. రాజలక్ష్మమ్మ కోడలిని లేవనెత్తి "బిడ్డా! నీ సదయహృదయము, సాధువర్తనమే నిన్ను రక్షించుగాక! నాపుణ్యము బాగుండబట్టి కన్నులచల్లగా మిమ్ములనంతా చూచుచున్నాను. దైవము నిన్ను రక్షించెను. సౌభాగ్యవతివై వర్ధిల్లుము!" అని ఆశీర్వదించెను.